బడిలో బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన పుత్తడి బొమ్మలకు మూడుముళ్ల బంధనాలు వేసి వారి భవితను చిదిమేస్తున్నారు. తల్లిదండ్రుల ఆర్థిక సమస్యలు. అవగాహన లోపం, నిరక్షరాస్యత బాల్య వివాహాలకు కారణమవుతున్నాయి.

# పుత్తడి బొమ్మకు పుస్తెల బంధనం



- బాలికల బంగారు భవిష్యత్తుకు బ్రేక్
- చైతన్యం వస్తేనే బాల్యవివాహాలకు అడ్డుకట్ట
- కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల గ్రామాల్లో వివిధ కారణాలతో బాల్యవివాహాలు జరుగుతున్నాయి. కేవలం అవగాహణ లోపం, అనాలోచిత నిర్ణయాలతో పెళ్లిళ్ల చేస్తున్నట్టు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. హాయిగా తోటి విద్యార్థులతో చదువుకోవాల్సిన వయస్సులో మూడుముళ్ల బంధంతో భవితకు అడ్డుకట్ట వేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొచ్చినా జిల్లాలో ఎక్కడో ఓ చోట వెలుగు చూస్తునే ఉన్నాయి. తమ పిల్లలకు మంచి సంబంధం చూసి మూడుముళ్లు వేయించి తమ బాధ్యత తీర్చుకోవాలని ప్రతి తల్లిదండ్రులు భావిస్తుంటారు. ఇదే క్రమంలో తొందరపడి వివాహం చేస్తున్నారు. ఎక్కువగా అమ్మాయిల విషయంలోనే వివాహాలు జరుగడంలో భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు అధికంగా వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటిని నియంత్రించాలని అధికారులు చెబుతున్నారు.

## చట్టం ఏం చెబుతుందంటే..

బాల్య వివాహాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదు. వాస్తవంగా బాలిక వయస్సు 18, యువకుడి వయస్సు 21 ఏళ్ల నిండిన తర్వాతనే వివాహం చేయాల్సి ఉంటుంది. ఈ వయస్సు లోపల చేస్తే మాత్రం బాల్యవివాహాల కిందకు వస్తాయి. ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్టు 2006(పీసీఎంఎ) కింద బాల్యవివాహాన్ని నిర్వహించిన వారికి, ప్రోత్సహించిన వారికి, అనుమతించిన వారిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. ఆధారాలు పక్కాగా రుజువయితే రెండేళ్ల జైలు, లక్ష రూపాయల జరిమానా కూడా విధించే అవకాశాలున్నాయని న్యాయనిపుణులు చెబుతున్నారు.

## బాల్య వివాహాలు చేస్తే చర్యలు..

- మహేష్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి



బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. బాల్య వివాహం జరిపినట్టు నిర్ధారణ జరిగితే అందరిపై కేసులు నమోదు అవుతాయి. చట్ట ప్రకారం వయస్సు రాని వారికి వివాహం చేసినట్లు రుజువ యితే రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది. బాల్యవివాహాలు చేస్తున్న ట్లు తెలిస్తే వెంటనే 1098, 112కు సమాచారం ఇవ్వా లి. సమాచారం ఇచ్చిన వారి పేర్లను బయటికి రాకుండా చూస్తాం.

## చట్ట ప్రకారం నేరం..

- రామానుజం, డీఎస్పీ, కాగజ్‌నగర్



బాల్య వివాహాలు చేయటం చట్ట ప్రకారం నేరం. బాల్య వివాహాలు చేయకుండా ఉండేందుకు కౌన్సెలిం గ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. షీ టీం ఆధ్వర్యంలో కూడా మహిళా చట్టాలు, భద్రత, బాల్య వివాహాలు చేయడం వల్ల తలెత్తే ఇబ్బందులపై అవగాహన కల్పిస్తున్నాం. బాల్య వివాహాలు ఎక్కడైన జరుగుతున్నట్లు గుర్తిస్తే సమాచారం ఇవ్వాలి.

### ● ఇవీ అనర్థాలు..

బాల్య వివాహాలు చేయడం వల్ల ఎన్నో రకాల అనర్థాలు తలెత్తుతున్నాయి. బాలికలు రక్తహీ నతకు గురికావడం, అనా రోగ్యకర శిశువులకు జన్మ నివ్వడం వంటివి చోటు చేసుకుం టున్నాయి. సరైన అవగాహన లేక కలహాలు ఏర్పడి విడాకులు తీసుకునే వారకు పరిస్థితులు వెళుతున్నాయి. యుక్త వయస్సు రాక ముందే వివాహనం చేయడం వల్ల చదువు కొనసాగిం చే అవకాశం కోల్పోతున్నారు. బాలికల మానసిక పరిస్థితి గందరగోళంగా మారుతోంది. గృహ హింసకు గురవుతున్నారు. ప్రసూతి మరణాలు సైతం సంభవిస్తున్నాయి.

## కుటుంబాల్లో మార్పు కోసం..

కుటుంబాల్లో మార్పు కోసం బాల్య వివాహాలు చేయడం వల్ల తలెత్తే అనర్థాలపై జిల్లాలో ఐసీడీఎస్, పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో బాల్యవివాహాల సంఖ్య క్రమంగా తగ్గుతోం దని చెబుతున్నారు. కౌటాల మండలం శీర్గా, గోవింద్‌పూర్ గ్రామాల్లో బాల్యవివాహాలు గతంలో ఐదు నుంచి ఆరు జంటలకు నిర్వహించారు. దీంతో జిల్లా యంత్రాంగం పూర్తిగా ఈ గ్రామంలోనే మకాం వేసి ఐసీడీఎస్, పోలీసుల సహకారంతో కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి పెళ్లిళ్ల జరుపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అధికారులు బాల్య వివాహాల వల్ల తలెత్తే



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మహేష్

అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చేయమని కూడా ఈ గ్రామంలో ప్రతిజ్ఞ కూడా చేయించారు. అధికారులు చేసిన కృషి ఫలించడంతో బాల్యవివాహాలు ఈ గ్రామంలో పూర్తిగా బ్రేక్ పడిందని చెప్పవచ్చు. గత ఏడాది పెంచికలపేటలోని ఎల్కపల్లిలో కూడా ఇదే తరహాలో బాల్యవివాహం చెస్తున్నారని తెలియడంతో ఐసీడీఎస్, పోలీసులు అక్కడికి చేసుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి పెళ్లిని రద్దుచేశారు. జిల్లాలో అధికారులు బాల్యవివాహాలను రద్దు చేసి, కౌన్సెలింగ్ చేసిన వాటి వివరాల లెక్కల ప్రకారం పరిశీలిస్తే 2022లో 35, 2023లో 27, 2024లో 14, 2025లో 14, 2025లో 3 ఉన్నాయి. అధికారులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెబుతు న్నారు. ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడితే వంద శాతం అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

## ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్సు కమిటీ ప్రతినిధులతో శుక్రవారం ఇసుక, మట్టి రక్షణ చర్యలపై సమీక్షించారు. జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు, రెవిన్యూ, మైనింగ్, ట్రాన్స్‌పోర్టు అటవీ శాఖ అధికారులతో టాస్క్‌ఫోర్సు కమిటీని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తామని అన్నారు. తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లాలోని ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ● తాగునీటి ఇబ్బందులు ఉండొద్దు

వేసవి కాలం సమీపిస్తున్నందున మున్సిపాల్టీల్లో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మున్సిపాల్టీ అధికారులతో తాగునీరు, పారిశుధ్యం, ఆస్తి పన్ను అంశాలపై సమీక్షించారు. మున్సిపాల్టీల పరిధిలో ఎలాంటి తాగునీటి సమస్య లేకుండా ముందస్తు కార్యాచరణతో తగిన చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ పైపులైన్లు చేతి పంపుల మరమ్మతులు చేపట్టాలని అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ఆదేశించారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులు, కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలో 30 వార్డుల్లో ఆస్తి పన్ను వసూలు వంద శాతం మార్చి నెల వరకు చివరి వరకు పూర్తి అయ్యేలా దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర శ్రద్ధా శుక్లా, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పశుగణన ప్రక్రియను వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పశుగణన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పశు సంవర్ధక శాఖ, పశువైద్య కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. భవన పరిసరాలు, రిజిస్టర్‌లను పరిశీ లించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పశువైద్య కార్యాలయానికి సంబంధించి ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పశువైద్య అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో మూగ జీవాలకు సకాలంలో వైద్య చికిత్సలు అందించాలని చెప్పారు. నిర్ణీత సమయంలో వాక్సినేషన్ చేయాలని తెలిపారు. ఇటీవల జిల్లాలో నూతనంగా ఏడుగురు పశువైద్యులు విధుల్లో చేరారని అన్నారు. దీంతో జిల్లాలో పశువైద్యల కొరత లేదని, మారుమూల గ్రామాల్లో సైతం శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా ఎండల తీవ్రత వల్ల పశువులు వ్యాధుల బారిప పడే అవకాశం ఉందన్నారు. పశువైద్యాధికారులు స్థానికంగా అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని తెలిపారు. పశువుల యజమానులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. జాతీయ పశుగణన ప్రక్రియ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సురేష్, పశువైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

దహెగాం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ద్విచక్రవాహనాలపై ఉన్న పాత జరిమానాలను వెంటనే చెల్లించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సూచించారు.

## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండలంలోని బాలాజీఅనుకోడ గ్రామంలో జిల్లా ఇన్‌చార్జి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యలను గెలిపించాలని కోరారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి, జిల్లా అధ్యక్షుడు, మండలాధ్యక్షులను కార్యకర్తలు ఈ సందర్భంగా సన్మానించారు.

**బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి తరపున బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలపిం చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి, రమేష్, ప్రవీణ్, ఎస్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు పోషకాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, నిత్యావసర సరుకులు, పరిసరాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం వద్ద చేపడుతున్న నవీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. లోపం కలిగిన పిల్లలను గుర్తించి వారికి సకాలంలో పౌష్టికాహారం, మందులను అందించి సాధారణ స్థితికి తీసుకు ొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం బూర్గుడ జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యత వివరాలను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పదో తరగ తిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి భాస్కర్ పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన

వాంకిడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెండార పాఠశాల, వాంకిడి మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం క్షయవ్యాధి లక్షలణాలు, ప్రభావం, చికిత్సపై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలు రెండు వారాలు మించి దగ్గు, ఛాతిలో నొప్పి, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, దగ్గినప్పుడు తెమడలో రక్తం రావడం వంటివి గుర్తిస్తే ఆస్పత్రిలో చూపించుకోవాలని హెచ్‌ఈవో రవిదాస్ తెలిపారు. కార్యక్రమంలో భగవన్‌దాస్, సురచిత తదితరులు పాల్గొన్నారు.



# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు




విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈవో అంజయ్య

తిర్యాణి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ముడిపడి ఉందని తిర్యాణి ఎంఈవో అంజయ్య అన్నారు. మండలంలోని కేజీబీవీలో ఇంటర్, ఎంపీహెచ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇష్ట పడి చదివి ఉతన్న శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వో స్వప్న తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి):** బెజ్జూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట పాటా అలరించింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు తిరుపతి, పునీత్, ముకుం దరావు, సంతోష్, రఘునాథ్, విజయ, కవిత, అనసూర్య, శ్రీలత, నర్మద, ఇందిరా పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని ఆదరించాలి

బెజ్జూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో కాంగ్రెస్ నాయకులు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఓటు చేయాలని శుక్రవారం ప్రచారం చేశారు. మండల కేంద్రంలోని జ్యోతిబాఫులే పాఠశాలతో పాటు మండల కేంద్రానికి చెందిన పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. అర్హులకు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీవర్ధన్, సునీల్‌కుమార్, సురేష్‌గౌ డ్, మల్లేష్, సల్మాన్‌ఖాన్, పోశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అడవులను సందర్శించి.. పక్షుల గురించి తెలుసుకుని..

పెంచికలపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాల విద్యాశాఖ, జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో గో టు నేచర్, ప్రకృతిలోకి వెళ్దాం అనే కార్యక్రమంలో భాగంగా ఎనిమిది నుంచి పదో తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులు శుక్రవా రం పెంచికలపేట అడవులను సందర్శించారు. ముందుగా బొక్కివాగు ప్రాజెక్టు వద్ద వివిధ రకాల పక్షులను విద్యార్థులు తిలకించారు. అనంతరం గుండెపల్లి, నందిగామ బేస్ క్యాంపులలో వివిధ రకాల వృక్ష జాతులు, జంతు జాతుల వివరాలను అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట అధికారి విద్యాసాగర్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్, ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.



గో టు నేచర్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



## ప్రశ్నించే గొంతుకను గెలిపించాలి

పెంచికలపేట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలో శుక్రవారం ఆయన హరికృష్ణ తరపున ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## శివరాత్రి జాతర పోస్టర్ల విడుదల

కౌటాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి(కుర్ద) ఆలయంలో ఈ నెల 26న నిర్వహించే మహాశివరాత్రి జాతర పోస్టర్లను సాదు సంత్ బాల్‌బ్రహ్మాచారి పితాంబర్ మహరాజ్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు తలల పాము పట్టివేత

సిర్పూర్(టి), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షేక్మాద్‌గూడ లో గురువారం రాత్రి అటవీశాఖ సిబ్బంది రెండు తలల పామును పట్టుకున్నారు. గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని దాన్ని రక్షించి ఉన్నతాధికారుల సమాచారం మేరకు దగ్గర్లోని అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచి పెట్టారు. ఈ పాముని రెడ్ సాండ్‌బో అంటారని, మట్టి బొరియల్లో నివాసం ఉంటూ కీటకాలు, ఎలుకలు, వంటివి తింటుందని ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సిర్పూర్(టి), ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం వెంపల్లి- సిర్పూర్(టి) రైల్వే స్టేషన్ మధ్యలో ఆరగూడ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కెసురేష్‌గౌడ్ తెలిపారు. మంచిర్యాల నుంచి బల్లార్షా వైపు వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని చెప్పారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్ర పరిచామని తెలిపారు.

## ఈసుగాం శివమల్లన్న జాతరకు ఏర్పాట్లు

**వేణుగోపాల్, ఆలయ ఈవో**



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి:** ఈసుగాం శివమల్లన్న జాతరకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

**ఈవో:** ఈసుగాం శివమల్లన్న జాతర ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. సిర్పూరు నియోజకవర్గంలోనే అతి పెద్ద జాతర కావడం ఈసారి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది.

**ఆంధ్రజ్యోతి:** భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తీసుకుంటున్న చర్యలు ఏంటి?

**ఈవో:** జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రత్యేక దర్శనం కోసం బారికేడ్లు ఏర్పాటు చేశారు. జాతర సమయంలో భక్తుల కోసం వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు.

**ఆంధ్రజ్యోతి:** ఎండల తీవ్రత పెరిగినందున నీడ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటు న్నారు?

**ఈవో:** ప్రస్తుతం మధ్యాహం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఆలయానికి ముందు భాగంలో షామియానాలను ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల కోసంతాగునీటి సౌకర్యం సైతం కల్పిస్తున్నాం.

- కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి)

## వేసవి ప్రణాళిక రూపొందించాలి

కెరమెరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో కలిసి కేస్లాగూడ మంచినీటి ట్యాంకను శుక్రారం పరిశీలించారు. ఈ ట్యాంకు ద్వారా ఉట్నూరు ఏజెన్సీ మండలాలకు తాగునీరు అందజేస్తున్నారు. అనంతరం ఆయన ఎంపీడీవో కార్యాయలంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్, మిషన్ భగీరథ అధికారులు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి):** వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. సమావేశంలో ఏఈ ఉదయ్‌వీర్, పాల్గొన్నారు.



# కూరగాయల సాగు బాగు

**జిల్లాలో ప్రధాన వ్యాపకంగా పంట**

**మహారాష్ట్రతో పాటు చుట్టు పక్కల జిల్లాల్లో విక్రయం**

**ఆదాయం బాగుందంటున్న రైతులు**

కెరమెరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో పంటల సాగులో మార్పు వస్తోంది. సంప్రదాయ పంటలైన పత్తి, కంది పంటలకు ప్రత్యామ్నాయంగా రైతులు కూరగాయల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఇంత వరకు అంతర్ పంటలుగా ప్రాధాన్యమిచ్చిన కూరగాయల సాగు ఇప్పుడు తమ ప్రధాన వ్యాపకంగా మార్చుకున్నారు. జిల్లాలోని కాగజ్‌నగర్ మండలంతో పాటు బెజ్జూరు, చింతలమానేపల్లి, కౌటాల, కెరమెరి తదితర మండలాల్లో కూరగాయల పంట సాగు చేస్తే రైతులు ఆదాయం పొందుతు న్నారు. ఒక్క కెరమెరి మండలంలోనే సుమారు 418 ఎకరాల్లో కూరగాయల పంట వేస్తున్నారు.

మండల కేంద్రంతో పాటు సావర్‌ఖేడ, సాంగ్వీ, కైరి, నిశాని, ఇందాపూర్ గ్రామాల్లో కూరగాయల సాగు అధికంగా వేస్తున్నారు. కెరమెరిలో 60 మంది రైతులు 155 ఎకరాల్లో పంట వేశారు. సావర్‌ఖేడలో 43 మంది రైతులు 63 ఎకరా ల్లో, కిరిడిలో 36 మంది రైతులు, 47 ఎకరాలు, కైరి గ్రామంలో 64 మంది రైతులు 110 ఎకరాలు, నిశాని గ్రామంలో 26 మంది రైతులు 43 ఎకరాల్లో కూరగా యల పంట వేశారు. కష్టానికి తగ్గ ఫలితం రావడంతో రైతులు ఉత్సాహంగా కూరగాయల సాగు వైపు మళ్లుతున్నారు.

### అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి..

**రాందాస్, రైతు, సావర్‌ఖేడ**



వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల పంటలను పరిశీలించి సూచనలు చేయాలి. కూరగాయాల విత్తనాలు సైతం సబ్సిడీపై అందిస్తే రైతులకు ప్రయో జనకరంగా ఉంటుంది. మార్కెట్ సౌకర్యంపై అధికారులు సూచనలు చేస్తే బాగుంటుంది.

### మిర్చి, బీరకాయ..

రైతులు మిర్చి, చిక్కుడుకాయ, అలసంద, బెండకాయ, టమాటా, బీరకాయ, వంకాయతో పాటు పలు రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. నీటి సౌకర్యాం కలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తాము పండించిన కూగరాయలను మహారాష్ట్రలోని గడ్ చాందూర్, చంద్రాపూర్, నాగ్‌పూర్ తదితర ప్రాంతాలతో పాటు ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, గోదావరిఖని, వరంగల్ తదితర ప్రాంతాలకు తరలిస్తూ విక్రయిస్తారు. వేకుమజామునే రైతులు ఆటోలు, ఇతర వాహనాల్లో కూరగాయల బస్తాలు వేసుకుని మార్కెట్లకు తరలిస్తున్నారు. పెంపకం ఆరంభం నుంచి రెండు, మూడు నెలల్లోనే కూరగాయల పంట చేతికి వస్తుంది. ఆదాయం సైతం బాగుండడంతో ఏటేటా కూరగాయల సాగు పెరుగుతోంది. వ్యవసాయశాఖ ప్రోత్సాహం అందిస్తే మరింత కూరగాయల సాగు చేసే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.





కెరమెరిలో సాగు చేస్తున్న బీర, వంకాయ పంట

### పశువులు పట్టివేత

వాంకిడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వాహనంలో అక్రమంగా పశువులను తరలిస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. పోలీసులు మండలం లోని టోల్‌ప్లాజా సమీపంలో ఖమాన ఎక్స్ రోడ్డు వద్ద సిబ్బందితో కలిసి శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనం(ఎంఐహెచ్ 34 జీజెడ్ 7330)లో తనిఖీ చేయగా రెండు దూడలు, ఎనిమిది ఆవులు, రెండు ఎద్దులు ఉన్నాయి. ఆధారాలు లేక పోవడంతో పట్టుకున్నారు. ఈ మేరకు పశువులను తరలిస్తున్న మహారాష్ట్రలోని గడ్‌చం దూర్‌కు చెందిన షేక్ సమీర్, రియాజ్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని విచాచారు. పశువులను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు వారు ఒప్పుకున్నారని ఎస్సై తెలిపారు. పట్టుబడ్డ పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు తెలిపారు.

### యువతి అదృశ్యం

నెన్నెల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన 22 ఏళ్ల యువతి మూడు రోజుల కిందట అదృశ్యమైందని ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఈ నెల 18న బ్యాంక్ అకౌంట్ తీసుకుంటానని తల్లికి చెప్పిన యువతి ఇంటి నుంచి బయలుదేరి ఎటో వెళ్లిపోయిందని చెప్పారు. అదే రోజు సాయంత్రం పొరుగింటి వారికి ఫోన్ చేసి తాను బెల్లంపల్లి బుగ్గ రాజేశ్వరస్వామి గుడిలో పెళ్లి చేసున్నట్టు చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నదన్నారు. కుటుంబ సభ్యులు మూడు రోజుల పాటు ఆమె కోసం వెతికినప్పటికి ఆచూకి లభించలేదని పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## కాంగ్రెస్‌కు దూరంగా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప?

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. సిర్పూరు నియోజకరవర్గంలో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. సిర్పూరు నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఓట్లు చీల్చడంతోనే తాను ఓటమి చెందానని, తన ఓటమికి కారణమైన వ్యక్తిని బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం ఆయనను పార్టీలోకి తీసుకోవడంతో కోనప్ప తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఎంపీ ఎన్నికల ముందు తన అనుచరగణంతో కలిసి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా కొంత కాలంగా మాజీ ఎమ్మెల్యే కోనప్ప మౌనం పాటించారు. ఇటీవల కౌటాల మండలం వీర్దండి గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీపై తన అసంతృప్తిని వెలిబుచ్చారు. తాను గతంలో మంజూరు చేసిన వంతెన, రోడ్ల పనులన్నీ పూర్తి చేయాలన్న ఆలోచనతోనే కాంగ్రెస్ పార్టీలో చేరానని అన్నారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ ఆ పనులను రద్దు చేసిందని బహిరంగంగానే విమర్శించారు. ఇక తాను స్వతంత్ర అభ్యర్థిగానే బరిలో దిగుతానని ప్రకటించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరు కాలేదు. కాగా శుక్రవారం పెంచికల్‌పేట మండలంలో బీఎస్పీ పార్టీ మద్దతు ఇస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి హరికృష్ణకు ఓటు వేసి గెలిపించాలని కోనప్ప ప్రచారం చేయడం చర్చనీయాంశమైంది.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వాహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయానలి రాష్ట్ర ఎలక్ట్రోల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈ నెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ కోసం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 17 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లాలో 470 ఉపాధ్యాయ ఓటర్లు, 6,137 పట్టభద్రుల ఓటర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ నెల 27న పోలిం గ్ ప్రక్రియలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుం టున్నామని వివరించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా తదితరులు

పోలింగ్ కేంద్రాల్లో షామి యానాలు, తాగునీరు, ఫర్నిచర్, వెలుతురు, ఫ్యాన్‌లు, ర్యాంప్‌లు, వీల్ చైర్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుం టున్నామని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి నియమాలపై అవగాహన కల్పించామని తెలిపారు. బ్యాలెట్ బాక్సులు బందోబస్తు మధ్య కరీంనగర్ కౌంటింగ్ కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతిగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, డీటీవో రాంచందర్, జిల్లా సహకార శాఖాధికారి బిక్కు, మార్కెటింగ్ అధికారి అశ్వర్‌హుస్సేన్, ఎన్నికల పర్యవేక్షకుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ బస



ఆశ్రమ పాఠశాలలో నిద్రిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కౌటాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం మొగడ్‌దగడ్‌లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాత్రి కలెక్టర్ వెంకటేష్ దోత్రే బస చేశారు. విద్యార్థుల స్టడీ అవర్స్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామార్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తురామ్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో ప్రసాద్, ఏవో ప్రేమలత, ప్రధానోపాధ్యాయుడు అశోక్ పాల్గొన్నారు.

## రేపు గురుకులాల ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు తెలంగాణ గురుకుల సెట్ పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నామని పీటీజీ గురుకులం ప్రిన్సిపాల్ కారం భద్రయ్య తెలిపారు. స్థానికంగా శుక్రవారం ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ఆరు పరీక్షా కేంద్రాలలో ఈ గురుకులం పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులుహాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. పరీక్షా కేంద్రాలకు ఉదయం 9 గంటల వరకు చేరుకోవాలని సూచించారు.

**సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి):** ఐదు నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాల కోసం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఆదివారం నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శారద తెలిపారు. విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి

వాంకిడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని భారత్ ఐక్యవేదిక ప్రతినిధులు జాడి అన్నారావు, జాడి ఆనంద్‌రావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకా లు, గ్రంథాలతో పాటు పాఠశాల అభివృద్ధికి రూ. 10వేల చెక్కును ప్రధానోపాధ్యాయుడు నటరాజన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇవే పాఠశాలలో చదువుకున్నామని చెప్పారు. పాఠశాలపై అభిమానంతో ప్రస్తుతం చదువుకుంటున్న విద్యార్థులను ప్రోత్సహించేందు కు గాను తమ వంతు బాధ్యతగా చేయూత ఇస్తున్నామని చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో టాపర్‌లుగా నిలిచిన విద్యా ర్థులకు ప్రోత్సాహకంగా తగిన పారితోషికం అందజేయను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమతాభారత్ ఐక్యవేదిక ప్రతినిధి డోంగ్రి ప్రవీణ్‌కుమార్, హెచ్ఎం నటరాజన్, చైల్డ్ హెల్ప్ లైన్ సూరప్‌వైజర్ పితాంబర్ తదితరులు పాల్గొన్నారు.

### యాక్టింగ్ ప్రమోషన్లను వెంటనే భర్తీ చేయాలి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాలో పెండింగ్ యాక్టింగ్ ప్రమోషన్‌లను భర్తీ చేయాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ నాయకులు ఏరియా ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. బ్రాంచ్ కార్యదర్శి వెంకట స్వా మి, రాజేందర్ మాట్లాడుతూ గత సెప్టెంబరులో భర్తీ చేసిన యాక్టింగ్ పదోన్నతులకు డిసెంబరు 23 మస్టర్ల ప్రతిపాదికన తీసుకుని భర్తీ చేశారని అన్నారు.దీంతో ఆయా వృత్తులకు సంబంధించి యాక్టింగ్ మస్టర్లు లేక యా క్టింగ్ పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. డిసెంబరు 24 మస్టర్ల ప్రతిపాదికన చర్యలు తీసుకోవాలన్నారు.

### నష్టపరిహారం అందజేత

భీమారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పులి దాడిలో గాయపడ్డ గేదె దూడ యాజమాని మేకల రాజేందర్‌కు మంచిర్యాలలోని తన కార్యాల యంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రత్నాకర్ రూ. 15 వేల నష్టపరిహారం అందజేశారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

తాండూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నా మని మండల తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, తాండూర్ సీఐ కుమారస్వామిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 52,29 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్ఐ కిరణ్‌కుమార్, డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

### వైద్య శిబిరానికి స్పందన

లక్సెట్టిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సబ్‌జైలులో అండర్ ట్రైన్ ఖైదీలకు వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. అండర్ ట్రైన్ ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

### ట్రైనీ పోలీసులకు అవగాహన

జన్నారం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 2024 బ్యాచ్ బెటాలియన్ ట్రైనీ కాళేశ్వరం జోన్ 55 మంది ప్రొబేషనరీ ఎస్ఐలు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజవర్ధన్ వారికి రికార్డుల నిర్వహణ, ఎఫ్ఆర్ఐ నమోదు పై అవగాహన కల్పించారు.




### సమస్యల పరిష్కారానికి కృషి

జైపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ స్టాఫ్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఏఐటీయూసీ కృషి చేస్తుందని యూనియన్ బెల్లంపల్లి రీజియన్ మైనింగ్ స్టాఫ్ సెక్రటరీ రాజేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం ఐకే1ఏ , ఐకే ఓసీపీ గనులపై మైనింగ్ స్టాఫ్ సిబ్బందిని కలి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 22న నర్సయ్య భవన్‌లో మైనింగ్ స్టాఫ్ సమావేశం ఉందని, దీనికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు సభ్యుడు సీతారామయ్య హాజరవుతున్నారని తెలిపారు. సభ్యులు సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బాలకృష్ణ, ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ , శంకరయ్య పాల్గొన్నారు.

### డైరెక్టర్, జీఎంలకు సన్మానం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె. వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్‌లను ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం సన్మానించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య మాట్లాడుతూ, జీఎంగా పనిచేస్తూ సింగరేణి డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లు అభినందనీయుడన్నారు. నూతన జీఎం ఎం. శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె. సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు, అన్ని గనుల పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

### క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించేందుకు ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 259 క్వార్టర్లు ఉండగా, 230 మంది దరఖాస్తు చేసుకున్నారు. 78 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 143 మంది గైర్హాజరు కాగా, 9 మంది క్వార్టర్లు వదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీ ఎం(పర్సనల్) అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, ఈఈ (సివిల్) గుండేరావు, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్య రహిత భారత్‌కు కృషి చేయాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత భారత్ కోసం ప్రభుత్వరంగ సంస్థలు కృషి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అభిప్రాయపడ్డారు. క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కీలక ఖనిజాలపై శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించి న జాతీయ సదస్సులో మాట్లాడారు.భవిష్యత్‌లో ఎలక్ట్రానిక్స్ రంగం, సంప్రదాయేతర ఇంధన వనరుల రంగం, విద్యుత్ వాహనాలు, రక్షణ రం గాల్లో కీలక ఖనిజాలు అవసరం ఉంటుందన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వరంగ సంస్థలు ముందుకు రావాలని కోరా రు. సింగరేణి సైతం భాగస్వామ్యం అవుతుందని చెప్పారు. సదస్సులో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి, సింగరేణి ఈడీ(కోల్ మూమెంట్), జీఎం(కోఆర్డినేషన్) సుభాని, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ చైతన్యమొయి గంగూలీ, ఎండీ సందీప్ హోమిల్టన్, మిధాని, న్యూక్లియర్ ఫ్యుయల్ కార్పొరేషన్, వేదాంత, తదితర కంపెనీల అధికారులు, ఐఐటీ సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

### బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన ఉత్పత్తిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా 37 రోజుల సమయం ఉందని తెలిపారు. సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యం చేరుకోవాలని సూచించారు. అనంతరం ఓసీపీలకు చెందిన అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో ఏరియా జీఎం ఎం శ్రీనివాస్, ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల పీవోలు శ్రీనివాస్, ఏవీరెడ్డి, మేనేజర్ బ్రహ్మాజీ, క్వాలిటీ ఇన్‌చార్జి కె వెంకటేశ్వర్ రెడ్డి, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, రక్షణాధికారి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిలో కాగిత రహిత సేవలు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడుకునేందుకు సింగరేణిలో కాగిత రహిత సేవలు ప్రారంభించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో 'సాప్' సాఫ్ట్‌వేర్‌లో ఫైల్ లైఫ్ సైకిల్ మేనేజ్‌మెంట్(ఎఫ్ఎల్ఎం) అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జీఎం హాజరై మా ట్లాడారు. సింగరేణిలో 'సాప్' అనే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఉద్యోగులు సమాచారం, వేతనాలు, ఇతర పనులు కచ్చితత్వంతో సులభతరంగా, కాగితరహితంగా చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఎఫ్ఎల్ఎం టెక్నాలజీని వినియోగిస్తున్నాయన్నారు. సింగరేణిలో సైతం ఈ సాంకేతికతతో పనులు పూర్తి చేయాలన్నారు. దీనివల్ల పేపర్ వినియోగం గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. దీని కోసం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగరేణి పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీని వాసరావు, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం సుశాంతసాహా, శ్రీరాంపూర్ ఎస్ఓ టు జీఎం సత్యనారా యణ, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో శ్రీనివాస్, ఏజీఎం క్వాలిటీ నవీన్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల నుంచి తప్పించుకోలేరు

### సీఐ శశిధర్‌రెడ్డి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి) : సీసీ కెమెరాల నుంచి నేరస్థులు ఎవరు కూడా తప్పించుకోలేరని, ప్రతి ఒక్కరు వారి నివాసాలకు సీసీ కెమెరాలను అమర్చుకోవడం మంచిదని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని అంగడి బజార్‌లో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వంద మందితో సమానమ న్నారు. కమ్యునిటీ హాల్‌కు సీసీ కెమెరా అవసరం అని చెప్పడంతో ఏర్పాటు చేసుకోవడం ఇతరులకు స్ఫూర్తి అని తెలిపారు. కెమెరాలు అమర్చుకున్న కాలనీ వాసులను ఆయన అభినందించారు. ప్రతి ఒక్కరూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని కాలనీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, నిరంతరం తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రిజిస్టర్‌లు, ప్రజాపాలన సేవా కేంద్రాలను పరిశీలించారు. తాగునీటి సరఫరా నిర్వహణపై కమిషనర్ శ్రీనివాస్‌రావు, అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రతి ఇంటికి నిరంతరం తాగునీటిని అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీటిని అందిచాలన్నారు. నీటా ట్యాంకులు, మోటార్ల మరమ్మత్తులు చేపట్టడంతో పాటు పైపులైన్ల లీకేజీలను గుర్తించి అవసరమైన మరమ్మతులు నిర్వహించాలన్నారు. ప్రతి రోజు చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే ఉద్యోగావకాశాలు

### పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

చెన్నూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌పాలనలోనే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని ఎంఆర్‌ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని, రానున్న నాలుగు సంవత్సరాల్లో 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### ఏడాదిన్నరలో 56 వేల ఉద్యోగాలు ఇచ్చాం

● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి: అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోగా 56 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్ర మల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ధర్మపురి పట్టణంలోని యోజక వర్గస్థాయి పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఓటమి భయంతోనే నరేందర్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. విద్యావేత్త, అల్ఫోర్స్ యజమాని నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. అభ్యర్థి డాక్టర్ వూట్కూరి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్,పక్కన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి,

పెద్దపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కార్యకర్తలంతా తమ పౌరుషాన్ని, దమ్ము చూపాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన బీజేపీ పచ్చీస్ ప్రభారీ సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకు రావాలనేది కార్యకర్తల ఆశయమన్నారు. రిజర్వేషన్ల పేరుతో ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తుందన్నారు. హిందువుల జాబితాలో ముస్లింలను ఎలా కలుపుతారని ప్రశ్నించారు. ఒకవైపు బీసీ జనాభాను తగ్గించి చూపుతున్నారని, ఇంకోవైపు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి అందులో 10 శాతం ముస్లింలకు కేటాయించడం కాంగ్రెస్ పార్టీ కుటిలనీతికి నిదర్శ నమన్నారు. జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గుజ్జుల రామక్రిష్ణారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, కాసిపేట లింగయ్య, టీచర్, గ్రాడ్యుయేట్ అభ్యర్థులు మల్క కొమరయ్య, చిన్నమైల్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

## వేసవి దుక్కులు రైతులకు మేలు చేస్తాయి

### చల్ల ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి:** వేసవి దుక్కులు రైతులకు ఏ విధంగా ఉపయోగపడతాయి ?

**అధికారి:** వేసవి దుక్కుల వల్ల భూమిలోపల దాగి ఉన్న లద్దె పురుగు, పచ్చ పురుగు, గులాబీరంగు పురుగు, ప్యూపా కోశస్త దశలో ఉండి వృద్ధి చెందుతాయి. లోతు దుక్కుల వల్ల రైతులకు హానీ చేసే క్రిములు, కీటకాలు ఉష్ణోగ్రత వేడికి చనిపోతాయి.

**ఆంధ్రజ్యోతి :** యాసంగి వరి ఎన్ని ఎకరాల్లో సాగు అయ్యింది ?

**అధికారి :** మండలంలో యాసంగి వరి 750 ఎకరాల్లో సాగు అయ్యింది. ఇప్పుడు ఎక్కువగా వరిలో జింక్ లోపం ఏర్పడుతుంది. అలాగే కాండం తొలిచే మొగి పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు చర్యలు తీసుకోవాలి

**ఆంధ్రజ్యోతి :** వరిని ఆశించే రోగాల నివారణకు యాజమాన్య పద్ధతులు ఏమిటి?

**అధికారి :** జింక్ లోపాన్ని నివారించేందుకు చలామిన్ జింక్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. మొగి , కాండం తొలిచే పురుగు నివారణకు కోరాజిన్ 60ఎంఎల్ ఒక ఎకరానికి 200 ఎంఎల్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అలాగే కార్టాప్‌హైడ్రోక్లోరైడ్‌ను ఒక ఎకరానికి 300 గ్రాముల ద్రావణాన్ని 200ఎంఎల్ నీటితో కలిపి పిచికారీ చేస్తే రోగాల బెడదను నివారించవచ్చు.

కాసిపేట, ఆంధ్రజ్యోతి

# డిజిటల్ బోధన.. మరింత మెరుగ్గా..



### కాంప్లెక్స్‌ల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం

కోటపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత పాఠశాలల్లో టచ్ స్ర్కీన్ టీవీల ద్వారా డిజిటల్ బోధనను మరింత మెరుగ్గా అందించేందుకు విద్యాశాఖ చర్యలకు పూనుకుంది. రెండేండ్ల కిందటే అమలులోకి వచ్చిన ఈ బోధనపై ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో డిజిటల్ బోధన వినియోగంలోకి రాలేదు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం ద్వారా దీన్ని వినియోగంలోకి తీసుకురావచ్చని భావించిన అధికారులు మంగళవారం నుంచి కాంప్లెక్సుల వారీగా శిక్షణకు శ్రీకారం చుట్టారు.

**రెండేళ్ల కిందటే...**

జిల్లాలో రెండేండ్ల కిందటే మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో డి జిటల్ బోధన అమలు చేసేందుకు ప్రభుత్వం ఐఎఫ్‌ఎస్ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ స్ర్కీన్)టీవీలను మంజూరు చేసింది. 8,9,10 తరగతుల విద్యార్థులకు ఈ టీవీల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో బోధనకు ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొదటి దశలో 59 పాఠశాలలకు ఒక్కో బడికి రూ. 10.59 లక్షల విలువైన పరికరాలు అందించారు. 75 అంగుళాల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), ఓపీఎస్, మెటల్ ఫ్రేమ్, ఆన్‌లైన్ యుపీఎస్, ఆరు బ్యాటరీలు, ఇతర పరికరాలను పాఠశాలలకు పంపిణీ చేశారు. విద్యుత్ సరఫరా లోపం ఉన్నా 6 గంటల పాటు బ్యాటరీలు పని చేయనుండగా టీవీకి ఇరువైపులా గ్రీన్ చాక్ బోర్డును ఏర్పాటుచేశారు. ఇక రెండో విడతగా జిల్లాలో 76 ఉన్నత పాఠశాలలకు వీటిని మంజూరు చేసి ఆయా తరగతి గదుల్లో బిగించడంతో డిజిటల్ బోధన విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది.

**మెరుగు పడనున్న విద్య...**

ఐఎఫ్‌పీతో ఉపాధ్యాయులు పాఠ్యాంశాల పంపిణీని మెరుగు పరుచుకునేందుకు వీలుంటుంది. యానిమేషన్ వీడియో పాఠాలు, పుస్తక లైబ్రరీ, పాఠ్య పుస్తకాలతో కూడిన ఇంటరాక్టివ్ పాఠాలతో అనేక రకాల సమాచారం వినియోగానికి అనుమతిస్తుంది. తద్వారా టీచర్లు తమ పాఠాలను అనుకూలమైన సమాచారంతో మెరుగు పర్చుకునే వీలుంది. తరగతి గదిలోనే సులభంగా బోధన, అభ్యాసాన్ని పూర్తి చేయవచ్చు. అంతేకాకుండా డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ స్ర్కీన్‌లు లాంటి స్మార్ట్ పరికరాలతో ఇన్నోవేషన్, క్లాస్ రికార్డింగ్, ఇంటరాక్టివ్ ఫీచర్లను లెర్నింగ్, సొల్యూషన్‌తో మిళితం చేయడం వల్ల విద్యార్థుల అభ్యసనానికి సంబంధించి నాణ్యమైన బోధ నకు ఇవి ఎంతో తోడ్పడతాయి. ఇంత వరకు బాగానే ఉన్నా ఉపాధ్యాయులకు వీటిపై అవగాహన లేకపోవడంతో వీటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు కాంప్లెక్సుల వారీగా శిక్షణను ప్రారంభించారు.

**విడతల వారీగా**

జిల్లాలో ప్రతి సబ్జెక్టు ఉపాధ్యాయులు ఇద్దరు చొప్పున 16 మందికి గత నెల 28, 29న రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఐఎఫ్‌పీలను ఉపయోగించేలా గణితం, భౌతిక, జీవశాస్త్రం, తెలుగు, ఆంగ్లం, హిందీ, సాంఘీక శాస్త్రంలో శిక్షణ పొందారు. రాష్ట్రస్థాయిలో ఎస్‌ఈఆర్‌టీ నుంచి విషయ నిపుణులు బోధనపై అవగాహన పొందిన రీసోర్స్ పర్సన్‌లు మండలాల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

జిల్లా కేంద్రంలో ప్రతి మండలం నుంచి సబ్జెక్టు ఉపాధ్యా యులు ఇద్దరిని ఎంపిక చేసి శిక్షణ ఇవ్వగా కాంప్లెక్స్ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉపాధ్యాయులకు సాంకేతికత, ఆయా సబ్జెక్టుల విషయాల పై శిక్షణ ఇవ్వడంతో స్మార్ట్ బోధనపై పూర్తిస్థాయిలో అవగాహన వచ్చిన తర్వాత ఆయా ఉన్నత పాఠశాలల్లోని డిజిటల్ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ పూర్తి స్థాయిలో అందు బాటులోకి రావడంతో పాటు మరింత ఆధునిక బోధన విద్యార్థులకు అందనుంది.





ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న రీసోర్స్‌పర్సన్, శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

## ఎల్‌ఆర్‌ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

ఉంటే మాత్రం రూ. 80వేల వరకు వసూలు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటి వరకు అధికారులు బుక్కిన డబ్బులు ఇకమీదట నేరుగా ప్రభుత్వ ఖజానాకు చేరనున్నాయి. ప్రభుత్వం వెసులుబాటు కల్పించడంతో వినియోగదారులపైనా కొంత భారం తగ్గినట్లయింది.

### సింగిల్ విండో పద్ధతిలో రిజిస్ట్రేషన్లు చేయాలి..

**వెంకటస్వామి రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు**



ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంవల్ల వేలాది మంది రియల్టర్లకు మేలు చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. రిజిస్ట్రేషన్లకు వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం అందుకు సింగిల్ విండో పద్ధతిని ప్రవేశపెట్టాలి. లేనిపక్షంలో వివిధ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వస్తుంది. కలెక్టరేట్‌లోనే రియల్ ఎస్టేట్ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి, దరఖాస్తుదారులకు నేరుగా అనుమతులు జారీ చేస్తే మేలు చేసినట్లవుతుంది.

### ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం..

**నీలి శ్రీనివాస్, రియల్ ఎస్టేట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి**



రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించినట్లయింది. ఇంతకాలం రిజిస్ట్రేషన్లు లేక రియల్టర్లు పెద్ద మొత్తంలో అప్పులపాలయ్యారు. రిజిస్ట్రేషన్లు జరిగితే ప్రభుత్వానికి నిధులు సమకూరడంతోపాటు మార్కెట్లోనూ డబ్బు చలామణి అవుతుంది. మరోవైపు దొడ్డిదారిన వెళ్లి వేలకు వేలు ఖర్చు చేయాల్సిన బాధలు తప్పినట్లయింది.

## గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

చెన్నూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కేంద్ర వైద్యఆరోగ్య శాఖ పరిశీలకులు డాక్టర్‌రమణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, మండలంలోని అంగ్రాజ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆస్నాద్ గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన పరిశీలించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. వైద్య బృందం శ్రీనివాస్, వెంకటేశ్వర్, ప్రశాంతి, కృపాబాయి, సామాజిక ఆరో గ్యకేంద్రం సూపరింటెండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## సోనియా కుటుంబంపై తప్పుడు ప్రచారం సరికాదు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి) : సింగరేణి కార్మికులకు సంబంధించిన సీఎంపీఎఫ్ నిధులు 720 కోట్లను డీహెచ్ ఎఫ్ ఎల్ (ది వాస్ హౌజింగ్ లిమిటెడ్)లో పెట్టుబడి పెట్టారని బీఎంఎస్ నేత లక్ష్మారెడ్డి, రాబర్ట్ వాద్రా, సోనియాగాంధీ పేరు ప్రస్తావించి తప్పుడు ప్రచారం చేయడం సరికాదని సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మారెడ్డి తమ నాయకురాలు సోనియాగాంధీ, రాబర్ట్ వాద్రాలపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. పెట్టుబడులు పెట్టిన విషయం 1908లో వెలుగులోకి వచ్చిందని, బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఇన్ని రోజులు సీబీఐకి దర్యాప్తు ఎందుకు చేయలేదని వారు పేర్కొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం

### ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

జైపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26 నుంచి జరిగే వేలాల జాతరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామి పేర్కొన్నారు. శుక్రవారం వేలాల జాతరలో జరిగే పనులను ఆయన పరిశీలించారు. గుట్టపైన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్లు, బారికేడ్లు, మంచినీటి వసతి ఏర్పాటు చేశామన్నారు. స్నాన ఘట్టాల వద్ద కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్,నగేష్ పాల్గొన్నారు.

**ఆలయంలో పూజలు**

మందమర్రిరూరల్ : మండలంలోని తిమ్మాపూర్‌లోని జగదాంబేశ్వర ఆలయంలో శుక్రవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ప్రత్యేక పూజలు చే శారు. ఆలయంలో నూతనంగా ప్రతిష్టిస్తున్న దేవ తామూర్తులను, యాగశాలను ఆయన పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు బండి సదానందం యా దవ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పరామర్శ**

**మందమర్రిటౌన్ :** సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతున్న ప్రభుత్వ మాజీ విప్ నల్లాల ఓదెలును చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఓదెలు కుటుంబీకులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



స్నానఘట్టాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేక్

## ఆర్థిక సహాయం అందజేత

గర్మిళ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలకు చెందిన వికలాంగుడైన ముడుసు లక్ష్మణ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా గురువారం అమృత హస్తం వెల్ఫేర్ సొసైటి సభ్యులు ఆయన కుటుం బానికి ఆర్థిక సహాయం అందించారు. వెల్ఫేర్ సొసైటి వృద్ధాశ్రమంలో లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కూతురు సాయిశ్రీ పేరు మీద రూ. 20 వేల నగదు ఫిక్స్ చేసి బాండ్‌ను లక్ష్మణ్ భార్యకు అందజేశారు. సభ్యులు తాజుద్దీన్, మహేందర్, రమేష్, సమ్మయ్య, ప్రభాకర్, రాజన్న, సుజాత, రమేష్, పాల్గొన్నారు.

## సాగునీరు రోడ్డు పాలు



రహదారిపై పారుతున్న నీరు

దండేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆంధ్రాకాలని సమీపంలో 28వ డిస్ట్రిబ్యూ టరీ కాలువలో రాష్ట్రీయ రాహదారికి అనుకుని ఉన్న ఓ కల్వర్టు వద్ద చెత్తచెదారం తట్టుకుని సాగునీరు ప్రధాన రహదారిపై శుక్రవారం ఉదయం పారింది. పొలాలకు అందాల్సిన సాగునీరు వృధాగా పోతుండడంతో ఆయకట్టు చివరి రైతులు ఆందోళన చెందుతున్నారు.

## బీజేపీ నాయకుల ప్రచారం

చెన్నూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు ప్రచారం నిర్వహించారు. మార్నింగ్ వాకర్స్‌ను కలిసి పార్టీ బలపరుస్తున్న అంజిరెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పట్టణాధ్యడు జాడి తిరుపతి, నాయకులు సమ్మయ్య, వెంకట నర్సయ్య, శ్రీపాల్, శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

**కాసిపేట :** పెద్దనపల్లిలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్, కార్తీక్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

**తాండూర్:** బోయపల్లి గ్రామంలోని గ్రంథాలయంలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ప్రచారం చేశారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు, మండల ఎన్నికల సహ ఇన్‌చార్జి న్యాయవాది నల్లుల సంగీత, కుమార్ పాల్గొన్నారు.

**వేమనపల్లి :** బీజేపీ ఎమ్మెల్సీ టీచర్స్ అభ్యర్థి మల్క కొమురయ్యను, గ్రా డ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డిని గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు వేమనపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్య క్రమంలో మండల అధ్యక్షుడు మదుకర్, నాయకులు పాల్గొన్నారు.

**కన్నెపల్లి :** మాడవెల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు బేరె రామన్న యాదవ్ ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పట్టభద్రులను కలిసి బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓట్లు వేయాలని కోరారు.

## ఎస్టీపీపీలో ఫ్యాక్టరీ చట్టాలను అమలు చేయడం లేదు

జైపూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీలో ఫ్యాక్టరీ చట్టాలను అమలు చేయడం లేదని ఐఎన్‌టీయూసీ ఎస్టీపీపీ అధ్యక్షులు రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్లాంటు ఏర్పాటు చేసి సంవత్సరాలు కావస్తున్నా కార్మికులకు రావాల్సిన హక్కులు కానరావడం లేదన్నారు. ప్లాంట్‌లో పదుల సంఖ్యలో మరణాలు సంభవించి నప్పటికీ మేనేజ్‌మెంట్ కప్పి పుచ్చు తూ వాటిపై సమగ్ర విచారణ జరిపించడం లేద న్నారు. ఎస్టీపీపీలో సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసి మూడు నెలలకు సారి పీరియాడికల్‌గా కార్మిక స మస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. కార్మికుల సమస్యలతో పాటు వెల్ఫేర్ చూడడానికి వెల్ఫేర్ ఆఫీసర్ లేకపోవడం బాధకరమన్నారు. క్యాంటీన్ కమిటీ ఏర్పాటు చేయకపోగా కాంట్రాక్టర్ పెత్తనంతో క్యాంటీన్ నిర్వహణ బాగా లేదన్నారు. అనంతరం డిప్యూటి చీఫ్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ రెడ్డికి, జాయింట్‌చీఫ్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబుకు వినతి పత్రం అందించారు. నాయకులు రామగిరి మల్లేష్, ఎల్క రమేష్, రాజిరెడ్డి, మనోజ్, నరేష్, రాకేష్‌కుమార్, నారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**మంచిర్యాల కలెక్టరేట్ :** జిల్లాలోని ప్రతి ఒక్కరు ఆధార్‌కార్డు కలిగి ఉండాలని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని యుఐడీఏఐ (ఆధార్) డిప్యూటి డైరెక్టర్ చైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వర్చువల్ విధానం ద్వారా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి ఆధార్ మానిటరింగ్ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

● ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు.

**బెల్లంపల్లిరూరల్ :** బెల్లంపల్లి మండలంలోని బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం దుకాణాలకు వేలం పాట నిర్వహించినట్లు ఈవో బాబురెడ్డి తెలిపారు. కొబ్బరికాయల విక్రయంకు రూ. 62 వేలు, ప్రసాదాల విక్రయానికి రూ. 1,11,000, తైబజార్ కోసం 1,00,000, పార్కింగ్ కోసం రూ. 1,00,000, మొత్తం రూ. 3,73,000 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

**బెల్లంపల్లి :** బెల్లంపల్లిలోని శాంతిఖని గనిలో శుక్రవారం గైర్హాజరు కార్మికులకు అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు ముస్తాఫా, రమేష్, ఏఐటీయూసీ నాయకులు సత్య నారాయణ, అనుదీప్, రవికుమార్ పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్ :** పొన్నారం గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై హౌజింగ్ కార్పోరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బన్సీలాల్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇండ్లపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్ :** మండలంలోని నార్లాపూర్‌లో శుక్రవారం రైతులకు వరిలో మోగి పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఏఈవో ముత్యం తిరుపతి అవగాహన కల్పించారు. మోగి పురుగును ప్రారంభ దశలోనే గుర్తిస్తే వెంటనే నివారించవచ్చని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేకు రైతులు సహకరించాలన్నారు.

## లోకోపైలెట్ల సమస్యలను పరిష్కరించాలి

● ముగిసిన నిరసన దీక్ష



రైల్వేస్టేషన్ ఆవరణలో నిరసన దీక్ష చేస్తున్న లోకో పైలెట్లు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : లోకో పైలెట్లు (రైలు డ్రైవర్లు) సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలో చేపట్టిన 36గంటల నిరసన దీక్ష శుక్రవారం ముగిసింది. వారు మాట్లాడుతూ ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లోకో పైలెట్ల సమస్యలు పరిష్కరించాలని నిరసన దీక్ష చేపట్టామన్నారు. ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లకు 6గంటలు, గూడ్స్ రైళ్లకు 8గంటల డ్యూటీ పరిమితి అమలు చేయాలని కోరారు. రైళ్ల నిర్వహణలో భద్రతను నిర్ధారించడానికి డ్యూటీ గంటలను తగ్గించాలని కోరుతున్నామన్నారు. అదనపు గంటలు విధులు నిర్వహించడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లోకోపైలెట్లు ఏకే పటేల్, ప్రదీప్‌కుమార్‌సింగ్, వికాస్‌కుమార్, అజయ్‌కుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.


డిజిటల్ బోధన... మరింత మెరుగ్గా..

● కాంప్లెక్స్‌ల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం 7

కూరగాయల సాగు బాగు 6




# ఎల్‌ఆర్‌ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్..

- 2020లో జారీ చేసిన ఉత్తర్వులకు సవరణ
- మార్చి 31లోగా చెల్లిస్తే 25 శాతం రాయితీ
- జిల్లా వ్యాప్తంగా వేలాది మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న రియల్టర్లు
- అనుమతిలేని లే అవుట్ల కథ కంచికే..!

మంచిర్యాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరిస్తామన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ హామీని ఎట్టకేలకు నిలబెట్టుకుంది. పూర్తిగా కొత్త వెంచర్లకు కాకపోయినా, 2020 చట్టం ప్రకారం నిబంధనలను అనుసరించి ఏర్పాటు చేసిన వెంచర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఈ నెల 20న జీవో నెంబరు 28ని సీఎస్ శాంతికుమారి విడుదల చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో ఆనందం వెల్లివిరుస్తుండగా, నాలుగేళ్ల తమ నిరీక్షణకు ఫలితం లభించిందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయితీల్లో అక్రమ లే అవుట్లు, రిజిస్ట్రేషన్లు లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020 సెప్టెంబర్ 1న బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 26 ఆగస్టు 2020 లోపు సేల్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన లే అవుట్ యజమానులు, ప్లాటు ఓనర్లకు ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించినట్లు ప్రకటించింది. అందులోని లే అవుట్ నిబంధనలను సవరిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

### పది శాతం ప్లాట్లు విక్రయిస్తేనే...

రేవంత్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 2020 ఆగస్టు 26కు ముందు వెంచర్ ఏర్పాటు చేసిన యజమాని అందులో కనీసం 10శాతం ప్లాట్లను రిజిష్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా విక్రయించి ఉంటేనే ప్రస్తుత నిబంధన వర్తిస్తుంది. ఆ ప్రకారం సదరు వెంచర్‌లలోని మిగతా 90శాతం ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. తద్వారా 2020కి ముందు ఏర్పాటు చేసిన వెంచర్‌లోని మొత్తం ప్లాట్లను విక్రయించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. ఆ యా వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు మార్చి 31లోపు నిర్ణీత క్రమబద్ధీకరణ చార్జీలు, ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్ చార్జీలు చెల్లించిన పక్షంలో పై ఫీజుల్లో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ. 25 శాతం రాయితీ ఇస్తారు. ఈ ప్రకారం 200 చదరపు గజాలు కలిగిన ఒక్కో ప్లాటుపై కొనుగోలుదారులకు కనీసం రూ. 15వేల వరకు ఆదా అయ్యే అవకాశం ఉంది. అయితే వెంచర్‌లో నిబంధనల మేరకు 10శాతం రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా అమ్మకాలు జరుపనట్లయితే అందులో ఉన్న ఏ ఒక్క ప్లాటుకూ ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశాలు లేవు. అలాగే 2020 ఆగస్టు 26 తరువాత ఏర్పాటు చేసిన వెంచర్లలోనూ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు నిబంధనలు అనుకూలించవు. దీంతో అనుమతి లేని లేఅవుట్ల కథకంచికి చేరనుంది. అలాగే లేఅవుట్ లేని వెంచర్లలో ఏర్పాటు చేసిన వెంచర్లలో రోడ్డు కనీసం 30ఫీట్ల వెడల్పు ఉండాలి. రోడ్డు తక్కువగా ఉన్న పక్షంలో సదరు ప్లాటు నుంచే రోడ్డుకు సరిపడా స్థలం మినహాయించి, మిగిలిన భూమికే రిజిస్ట్రేషన్లు చేస్తారు. అలా రియల్ ఎస్టేట్ వ్యాపారుల తప్పిదానికి ప్లాట్ల కొనుగోలుదారులు మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

### అక్రమ వసూళ్లకు చెక్...

ప్రభుత్వ నిర్ణయంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమ వసూళ్లకు చెక్ పడనుండగా, ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరనుంది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వక ముందు దొడ్డిదారిన కొన్ని రిజిస్ట్రేషన్లు జరిగేవి. అలా రిజిస్ట్రేషన్ చేసే ఒక్కో డాక్యుమెంట్‌పై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ. 30వేల నుంచి రూ. 40 వేల వరకు అక్రమంగా వసూలు చేసేవారు. ఒకవేళ అందులో ఏ మైనా లిటిగేషన్లు...


(తరువాయి 7లో)


## ఘనంగా చండీ హోమం..

● యాగశాల చుట్టూ వేదపండితుల ప్రదక్షిణ



యాగశాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న వేదపండితులు

నస్పూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా శుక్రవారం విశేష చండీ హోమాలు, అమ్మవారికి లక్ష గాజుల అర్చన, లక్ష పుష్పార్చన, కోటి కుంకుమార్చన పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం గోపూజ, తులసీ పూజ, శ్రీ రుద్ర సహిత మృత్యుంజయ హోమాలు, రుద్రాభిషేకం, కుంకుమార్చనతో పాటు విష్ణు సహస్ర నామ, లలిత సహస్రనామ పారాయణాలు నిర్వహించారు. కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న అయుత చండీ, అతిరుద్ర మహా యాగంలో భాగంగా శుక్రవారం యాగశాల చుట్టూ యాగ బ్రహ్మ, అవధాని గట్టు నరహరి శర్మ, గట్టు వెంకటేశ్వర శర్మ వేదపండితులతో కలిసి ప్రదక్షిణ చేశారు.

## సంక్షేమ కార్యక్రమాలే విజయానికి దోహదపడతాయి

● చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలే పట్టభద్రుల ఎన్నికల్లో నరేందర్‌రెడ్డి విజయానికి దోహదపడతాయని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నారని తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరేందర్‌రెడ్డి ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేశారని ఆయన తెలిపారు. నాయకులు పల్లె రాజు, రఘునాథ్‌రెడ్డి, బండి సదానందం, రమేష్, తిరుమల్, రాయబారపు కిరణ్ పాల్గొన్నారు.

## సమావేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవో నాయకులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని టీఎన్ జీవో భవన్‌లో శనివారం సాయంత్రం 5 గంటలకు జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు, టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కార్యవర్గ సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి మల్లయ్య, శ్రీపతి బాపురావు, సతీష్‌కుమార్, కేజియా రాణి, శ్రీనివాస్, నరేందర్, రాం కుమార్, పద్మలత, సునీత పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ అశ్విని అన్నారు. శుక్రవారం పాఠశాల మైదానంలో ప్రీప్రైమరీ విద్యార్థులకు వార్షికోత్సవ క్రీడా పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ చదువుతో పాటు వివిధ క్రీడలు, క్విజ్ పోటీలను నిర్వహిస్తు పిల్లల మేదస్సును పెంచాలన్నారు. అనంతరం చిన్నారులక రన్నింగ్, మ్యూజికల్ చైర్, బాల్‌త్రో, బాల్ బ్యాలెన్సింగ్ లాంటి క్రీడలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులను అందజేశారు.. జోనల్ పీఈటి రాజేందర్, అకాడ మిక్ డెన్ శ్రీనివాస్, పీపీటి ఇన్‌చార్జి శిరీష, కిషన్, కుమార్ పాల్గొన్నారు.

## మందమర్రిలో రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

● ఏర్పాట్లు పరిశీలించిన నిర్వాహకులు



యోగా పోటీల ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో ఈ నెల 23న రాష్ట్ర స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం పోటీల నిర్వాహకులు, యోగా మాస్టర్ ముల్కల్ల శంకర్, అతని సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. పాఠశాల మైదానాన్ని యోగాకు సంబంధించి స్థలం ఎత్తు పల్లాలు లేకుండా చదును చేయించారు. యోగాలో పాల్గొనే వారికోసం ప్రత్యేకంగా టెంట్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. యోగా నిర్వాహకులు ముల్కల్ల శంకర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో నాలుగు విభాగాలు ఉంటాయని, వయస్సుతో పాటు పోటీ ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే యోగా సభ్యులందరికి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభిస్తారని, జీఎం దేవేందర్, సీఐ శశిదర్‌రెడ్డి, ఎస్సై రాజశేకర్, మున్సిపల్ కమిషనర్ రాజలింగులు హాజరవుతారని తెలిపారు.

## పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ



చెన్నూరులో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ

చెన్నూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరులోని పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం అయ్యాయా అని తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ పత్తి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్ర మంలో రైతుల సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కోటపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21 నుంచి 23 వరకు వికారాబాద్ జిల్లాలోని షేక్‌నగర్ గ్రౌండ్‌లో జరిగే 34వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు కోటపల్లి మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన తలారి రఘువర్ధన్ ఎంపికయ్యాడు. ఈ నెల 12న ప్రాణహిత స్టేడియం నస్పూర్‌లో జరిగిన మంచిర్యాల జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ప్రేమ్ కుమార్ తెలిపారు. రఘువర్ధన్‌ను సీనియర్ క్రీడాకారులు రాజేష్, శ్రావణ్, రఘు, రాజశేఖర్, రాహుల్‌లు అభినందించారు.

## సంపూర్ణ అక్షరాస్యతలో భాగస్వాములు కావాలి

● కలెక్టర్ కుమార్ దీపక్



కాసిపేట రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట మండలం సంపూర్ణ అక్షరాస్యత సాధించడంలో అందరు భాగస్వాములు కావాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వయోజన అభ్యాసన కేంద్రాలు కుట్టు శిక్షణ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు చదువుకుని నేర్చుకుని విజ్ఞానవంతులైతే మోసాలను పసిగట్టి మోసపోకుండా ఉండవచ్చన్నారు. దీంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రతి మహిళ అక్షర జ్ఞానం కలిగి ఉండాలని పేర్కొన్నారు. మహిళలకు చదువుతో పాటు వృత్తి విద్య నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు వృత్తి శిక్షణ కేంద్రాలను సైతం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో మొదటగా కుట్టు మిషన్‌ల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, అనంతరం అగర్‌బత్తీలు, క్యాండిల్స్ తయారీ, మగ్గం వర్కుల్లో నైపుణ్యం సాధించేందుకు శిక్షణ తరగతులు నిర్వహించి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకుచర్యలు చేపడుతున్నామన్నారు. దీనికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పాలు పంచుకోవాలన్నారు. మండలంలో 3462 మంది నిరక్షరాస్యులున్నట్లు గుర్తించడం జరిగిందని, వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వాలంటరీలను సైతం ఎంపిక చేశామన్నారు. వీరంతా మార్చి 31లోగా వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు కృషి చేస్తారన్నారు. వలంటరీలకు రూ. 10వేల వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. కాసిపేట మండలం సంపూర్ణ అక్షరాస్యత సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేయాలన్నారు. అనంతరం పలకలు, కుట్టు శిక్షణ మిషన్‌లు, పుస్తకాలు అందజేశారు. మండలంలో సంపూర్ణ అక్షరాస్యతకు సహకరిస్తున్న దేవాపూర్ ఓరియంట్ సిమెంటు కంపెనీ యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, లీడ్ బ్యాంకు మేనేజర్ తిరుపతి విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, సీడీపీవో స్వరూపరాణి, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంఈవో వెంకటేశ్వర స్వామి, డీఆర్‌పీలు బండ శాంకరి, సుమన్, జనార్దన్, కో ఆర్డినేటర్‌లు సంధ్యా, ధనలక్ష్మీ, ఐకేపీ, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిబింబం.. అపురూపం..

● నేడు ప్రపంచ కవలల దినోత్సవం..

నస్పూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : తల్లి గర్భం నుంచి కలిసి జన్మించిన కవలలు అచ్చు గుద్దినట్లు, కవలల పిల్లలను చూడగానే ఒకే రూపంతో ఇద్దరూ అపురూపంగా కనిపిస్తారు. సృష్టిలో మనిషిని పోలిన మనుషులు ఏడుగురు ఉంటారని పెద్దలు చెబుతుంటారు. ఆ ఏడుగురు ఎక్కడుంటారో ఏ వరికి తెలియదు, కానీ ఇందులో ఒకే రూపంతో ఇద్దరూ చిన్నారులు ఒకే ఇంట్లో ఉంటే ఆ తల్లిదండ్రుల ఆనందమే వేరు. ఇద్దరూ ఒకే రకమైన బొమ్మలు, ఒకే రకమైన దుస్తులు కొనుగోలు చేసి ఆప్యాయంగా చూస్తూ పిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులతో పాటు బంధువులు సంతోషంతో మురిసిపోతారు. ఒకే రూపంతో మొదలై క్షణాల వ్యవధిలో ప్రపంచానికి పరిచయమై అమితంగా అకట్టుకోవడమే ఈ కవలల ప్రత్యేకత. ఈ నెల 22న ప్రపంచ కవలల దినోత్సవం సందర్భంగా...

● నేపథ్యం...

మోజెస్-ఆరన్ విల్‌కాక్స్ కవల సోదరులు 1819లో తాము నివసించే ఊరుకు ట్విన్స్ బర్గ్ అని నామకరణం చేశారు. అంతే కాకుండా వారిద్దరూ కూడా అక్కచెల్లెలైన కవలలనే వివాహం చేసుకున్నారు. వారి ద్దరికి కూడా కవలల సంతానమే కలిగింది. కొంత కాలానికి ఇద్దరు సోదరులు ఒకే రకమైన వ్యాధితో మరణించారు. 1976లో పోలెండ్ దేశంలో తొలిసారిగా కవలల దినోత్సవాన్ని జరిపారు. కవల సోదరుల గౌరవార్థం ప్రతి ఏడాది ఫిబ్రవరి 22న అంతర్జాతీయ కవలల దినంగా పిలువబడుతుంది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం కవలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

● ఇద్దరికి ఒకే రకమైన డ్రెస్ కోడ్...



నస్పూర్ కాలనీకి చెందిన స్వప్న-కిరణ్ కుమార్ లు ప్రభుత్వ ఉద్యోగులు. వీరికి కవల పిల్లలు అమోగ్-అనాగ్ (లవకుశ). ఆరేళ్ల వయస్సు. ప్రైవేట్ పాఠశాలలో ఫస్ట్ క్లాస్ చదువుతున్నారు. ఇందరూ కలిసే ఉంటారు. ఒకే రకమైన అభిరుచులు. తమదైన ఆలోచనలతో ముందుకు వెళుతారు. సైకిల్ అయినా, డ్రెస్ అయినా ఇద్దరికి ఒకే రంగులోనే కొనాల్సిందే. ఏదీ కొన్న రెండు, ఒకే కలర్‌లో ఉన్న వాటినే తీసుకుంటూ ఉంటారు.

● రామలక్ష్మణులు...



నస్పూర్ కాలనీకి చెందిన రామ్-లక్ష్మణ్‌లు కవలలు. ఒకరు సింగరేణిలో పని చేస్తుండగా, మరొకరు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఇద్దరి అభిరుచులు ఒక్కటే. కలిసి నిర్ణయాలు తీసుకుంటా రు. మంచిగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. ఆ రామలక్ష్మణుల్లా ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇద్దరు కలిసి ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లితే అంద రి చూపు వీరివైపే ఉంటుంది.